సాక్షి
నారాయణపేట
ఆదివారం । 7 । మే । 2023



బాస్కెట్‌బాల్ సిస్టర్స్

కోయిలకొండ మండలం పెద్దతండాకు చెందిన అక్కాచెల్లెళ్లు బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్నారు.

వివరాలు 8లో ▸



ఆంజనేయా.. దీవించయ్యా

బీచుపల్లి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /25.3

వాతావరణం

రోజంతా ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కేసుల సత్వర పరిష్కారానికి కృషి



నారాయణపేట రూరల్: కోర్టులో కేసులు పెండింగ్ లేకుండా సత్వర పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని జిల్లా ప్రిన్సిపల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జిల్లాలోని పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాన్‌బెయిలబుల్, అండర్ ట్రయల్ ఖైదీల కేసుల విషయంలో ఆలస్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే పరిష్కారానికి సూచనలు చేశారు. కేసు ఛేదన వేగవంతంగా జరగాలని, ఆలస్యమయ్యే కొద్ది కేసు నీరుగారిపోతుందని, ఆధారాల లభ్యత తగ్గిపోతుందని అన్నారు. విచారణ సమయంలోనూ సమర్థవంతమైన అధికారుల నియామకం జరగాలని, పిటీ కేసుల విషయంలో లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునే విధంగా ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్‌జడ్జి మహ్మద్ ఉమర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జకియాసుల్తానా, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మండల కార్యాలయం తనిఖీ

ధన్వాడ: మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ వనజ తనిఖీ చేశారు. జిల్లా పరిషత్ నుంచి వచ్చిన నిధులు వాటి వివరాలను ఎంపీడీఓ సద్గుణని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం ఉన్నందున గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. జెడ్పీ నిధులు పూర్తిస్థాయిలో వినియోగం చేయాలని అన్నారు. ఇందులో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు వాహీద్ ఉన్నారు.

అండగా ఉంటాం : ఎస్పీ

నారాయణపేట రూరల్: పోలీసు శాఖలో పని చేస్తూ మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలో ఏఆర్ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ గత ఏడాది డిసెంబర్‌లో గుండెపోటుతో మరణించిన మనోహర్‌రావు కుటుంబ సభ్యులకు శనివారం ఎస్పీ ధైర్యం చెప్పారు. వీరికి మార్చిలో రూ.8లక్షల చెక్కును అందించగా తాజాగా అడిషనల్ కార్పస్ ఫండ్ కింద మంజూరైన రూ.50వేల చెక్కును బుధవారం అందించారు. అన్ని విధాలుగా పోలీసుశాఖ అండగా ఉంటుందని, మిగిలిన బెనిఫిట్స్ తొందరగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

ఊట్కూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ శైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రసవాల సంఖ్యను పెంచాలని, వ్యాధినిరోధక టీకాలను విధిగా వేయాలని సిబ్బందికి సూచించారు. డా వంశీ, వైద్య సిబ్బంది గోవిందరాజు, విజయకుమార్, రాజశ్రీ ఉన్నారు.

అంగన్‌వాడీల అభివృద్ధికి సహకరించాలి

మద్దూరు: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను స్థానిక ప్రజాప్రతినిధులు నెలకు నాలుగు సార్లు సందర్శించి ఈ కేంద్రాల ద్వారా శిశువులకు, బాలింతలకు, గర్భిణులకు అందుతున్న పౌష్టికాహారం, చేస్తున్న కార్యక్రమాలపై పరిశీలన చేయాలని జిల్లా శిశు సంక్షేమాధికారి వేణుగోపాల్ సూచించారు. శనివారం మండలంలోని షాగార్డెన్‌లో మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులకు మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. అలాగే జిల్లాలో ఐసీడీఎస్ ఐసీపీఎస్, చిల్డ్రన్, సఖి శాఖ ద్వారా అందిస్తున్న సేవలపై ఆయాశాఖల అధికారులకు అవగాహన కల్పించారు. అనాథ చిన్నారుల కోసం చిల్డ్రన్స్ హోం, వృద్ధుల కోసం వృద్ధాశ్రమం, సఖి కేంద్రాలను నారాయణపేటలో ఏర్పాటు చేసి వాటి ద్వారా అందుతున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మద్దూరు సర్పంచ్ అరుణ అంగన్‌వాడీల పనితీరు, వారిపై వస్తున్న విమర్శలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఎంపీఓ ఉదయ్‌శంకర్, పీహెచ్‌సీ డాక్టర్ శ్రీలత, భూమిక, రూమ్ టు రీడ్‌ప్రతినిధులు, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ అశోక్, మద్దూరు సీడీపీఓ రోజా, సఖి ఇన్‌చార్జ్ క్రాంతి, ఈఓ శ్రీలత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.





వేదికపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి , ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, జెడ్పీ చైర్‌పర్సన్లు స్వర్ణసుధాకర్‌రెడ్డి, సరిత, వనజ, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేష్‌రెడ్డి, జైపాల్‌యాదవ్ తదితరులు

మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

పాలమూరు.. పరిశ్రమల గడ్డ

ఐటీ కారిడార్‌తో మారనున్న ముఖచిత్రం

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్
- ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదు: మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- దివిటిపల్లిలో ఐటీ టవర్ ప్రారంభం, అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీకి శంకుస్థాపన
- జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో బహిరంగ సభ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ఒక పరిశ్రమ రావాలంటే ప్రత్యేక దీక్ష, పట్టుదల అవసరం.. తెలంగాణలో పరిశ్రమలు పెట్టేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేస్తున్నాం.. ఒక్క పైసా లంచం లేకుండా అనుమతులు ఇస్తున్నాం.. అందువల్లనే ఇతర దేశాలతో పోటీపడి మన రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారు.' అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. పాలమూరులో ఒకప్పుడు చదువుకున్న వారికి కొలువులు లేవు.. పరిశ్రమలు లేవు.. అలాంటి జిల్లా ఇప్పుడు ఇండస్ట్రియల్ ఖిల్లాగా మారింది.. ఐటీ కారిడార్‌తో పాలమూరు ముఖ చిత్రం మారనుందన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి వద్ద ఐటీ, మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా రూ.40కోట్ల వ్యయంతో నిర్మించిన ఐటీ టవర్‌ను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు. దేశంలో అతిపెద్ద, తెలంగాణలో మొట్టమొదటిదైన రూ.9,500 కోట్ల పెట్టుబడితో 10వేల మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాటు చేస్తున్న అమరరాజా గిగా కారిడార్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా శిల్పారామం, కేసీఆర్ అర్బన్ ఎకోపార్కులో జంగిల్ సఫారీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అమరరాజా కంపెనీ ఏర్పాటు చేసేందుకు ఎనిమిది రాష్ట్రాలు పోటీపడ్డాయని.. ప్రత్యేక దీక్ష, పట్టుదలతో కృషి చేశామని.. మహబూబ్‌నగర్ జిల్లాలో ఏర్పాటు చేసేందుకు అమరరాజా గ్రూపు ముందుకు రావడం అభినందనీయమన్నారు.

పరోక్ష ఉపాధితోపాటు అనుబంధ రంగాల అభివృద్ధి..

దేశంలో 80 కోట్ల మంది యువత ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం సాధ్యం కాదని.. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పరిశ్రమలు ఏర్పాటు చేయడం సులభమని కేటీఆర్ పేర్కొన్నారు. ఒక పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా ఉద్యోగాలు లభించడమే కాకుండా, పరోక్షంగా కూడా ఉద్యోగాలు వస్తాయన్నారు. హైదరాబాదులో ఐటీ ప్రారంభం చేసినప్పుడు 3.20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తే.. ఇప్పుడు 10లక్షల మంది పని చేస్తున్నారని ఉదహరించారు. పరిశ్రమల వల్ల అనుబంధ రంగాలు కూడా అభివృద్ధి చెందుతాయని, చుట్టుపక్కల గ్రామాలు, పట్టణాల రూపురేఖలు మారుతాయన్నారు. ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జైపాల్‌యాదవ్, మహేశ్వర్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, గోరటి వెంకన్న, కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, స్పెషల్ సెక్రటరీ విష్ణువర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

మాది ఉద్యమ కుటుంబం: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

14 రోజులకు ఒకసారి తాగునీరు.. కేవలం 6 గంటల కరెంటు.. వసతులు లేని పాఠశాలలు.. ఉపాధి అవకాశాలు లేక బతుకుదెరువు కోసం ముంబై వలసలు.. పట్టించుకునే పరిస్థితిలో లేని కులవృత్తులు.. ఎండిన పొలాలు ఓ వైపు.. అన్నదాతల ఆవేదనలు ఒకవైపు అన్నట్లుగా సమైక్య రాష్ట్రంలో పరిస్థితులు ఉండేవని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఇప్పుడు అన్ని రంగాల్లో బాగుపడి అభివృద్ధి బాటలో ముందుకు సాగుతుంటే ఓర్వలేక ప్రతిపక్షాల నాయకులు కుట్రలు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. మత కలహాలతో ఒకరు.. అనేక ఏళ్లుగా అధికారం చేతుల్లో ఉంచుకుని.. అధికారం పోయిన తర్వాత పార్టీలు మారి మళ్లీ మోసం చేసేందుకు ప్రయత్నిస్తూ ఇష్టమొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. తమది ఉద్యమ కుటుంబమని.. ఇష్టమొచ్చినట్లు వాగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పాలమూరు దశదిశను మార్చే అమరరాజా గ్రూప్‌నకు చెందిన అతిపెద్ద లిథియం ఫ్యాక్టరీని దివిటిపల్లి ఐటీకారిడార్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. మరో 8 కంపెనీలు తమ యూనిట్లను నెలకొల్పేందుకు ఒప్పందం చేసుకున్నామయని.. ఇందులో అమెరికా కంపెనీ కూడా ఒకటి ఉందని వెల్లడించారు.

ఈ ఏడాది నుంచే పది లక్షల ఎకరాలకు నీరు..

కర్వెన, ఉదండాపూర్ రిజర్వాయర్లు కలిపి 33 టీఎంసీల నీళ్లను తెచ్చినామని.. ఈ ఆగస్టులో నింపబోతున్నామని.. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ పనులు 90 శాతం పూర్తయ్యాయని కేటీఆర్ వెల్లడించారు. పాలమూరు అంటే కేసీఆర్‌కు ఎంతో ప్రేమ అని.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ సచివాలయం ప్రారంభించిన తర్వాత మొదటి రోజు మొదటి సమీక్ష పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌పైనే చేశారని గుర్తు చేశారు. మీకు నీళ్లు ఇవ్వాలని, పీఆర్ఎల్ఐ ద్వారా ఈ ఏడాదిలోపే పది లక్షల ఎకరాలకు, కోయిల్‌సాగర్ ద్వారా 35 వేల ఎకరాలకు నీరు అందిస్తామన్నారు.

ఆ రోజు చెప్పిందే నిజమైంది..

తెలంగాణ ఉద్యమం జరిగిన రోజు ప్రాంతాలుగా విడిపోయి ప్రజలుగా కలిసి ఉంటామని గల్లా అరుణకుమారితో చెప్పామని.. ఆ రోజు చెప్పినదే ఈ రోజు నిజమైంది.. ప్రాంతాలుగా విడిపోయి వేర్వేరుగా, అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నాయని కేటీఆర్ అన్నారు. ఒక్క చుక్క కాలుష్యం బయటకు రాకుండా జీరో లిక్విడ్ వేస్ట్ పద్ధతిలో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అమరరాజా ప్లాంట్ ఏర్పాటుకానుందని వివరించారు. ఇంత పెద్ద ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ విజ్ఞప్తి చేశారని.. ఇందుకు కంపెనీ యాజమాన్యం అంగీకరించిందని వెల్లడించారు. ఈ మేరకు నూతన ఐటీ టవర్‌లో స్థానికులకు శిక్షణ కార్యక్రమాలను ఇప్పటి నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.



జూనియర్ కళాశాల మైదానంలో బహిరంగసభకు హాజరైన జనం



మినీ శిల్పారామంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

తోబుట్టువులా ఆదరించండి..



'మీ ఆడబిడ్డగా ఇక్కడకు వస్తున్నా.. తోబుట్టువు లా ఆదరించండి' అని అమరరాజా గ్రూప్ కో ఫౌండర్ గల్లా అరుణ కుమారి కోరారు. మళ్లీ సొంత రాష్ట్రానికి వచ్చినట్లు ఫీలవుతున్నానన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేటీఆర్, హరీశ్‌రావు సిస్(సిస్టర్) అని పిలిచేవారు. నేను తమ్ముడిగా భావించి మొట్టికాయ వేసేదాన్నని గుర్తు చేశారు. అమరరాజా ఫౌండర్ రామచంద్ర నాయుడు మాట్లాడుతూ సాధ్యమైనంత ఎక్కువ మందికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమన్నారు. చైర్మన్ గల్లా జయదేవ్ మాట్లాడుతూ అమరరాజా గిగా కారిడార్ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు.

భూముల వివరాలు అందించిన వక్ఫ్ బోర్డు



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు బృందం

సాక్షి ఎఫెక్ట్..

కోస్గి: మండల పరిధిలో జరిగిన వక్ఫ్ బోర్డు భూముల అక్రమ వ్యవహారంపై 'సాక్షి' వరుస కథనాల నేపథ్యంలో శనివారం వక్ఫ్ బోర్డు అధికారుల బృందం కోస్గి తహసీల్దార్‌కు భూముల పూర్తి వివరాలను అందజేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు సీఈఓ ఆదేశాల మేరకు బోర్డు ఇన్‌స్పెక్టర్లు అబ్దుల్ రియాజ్, మహ్మద్ సైఫొద్దీన్, లీగల్ క్లర్క్ మహ్మద్ మహబూబ్ బృందం తహసీల్దార్ మమతతో సమావేశమయ్యారు. వివరాలు తెలియజేశారు. వక్ఫ్ రికార్డుల ప్రకారం గతంలో రంగారెడ్డి జిల్లా ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లా గండేడ్ మండలం సాలర్‌నగర్‌లోని ఆషూర్ ఖానాకు సంబంధించిన ఆస్తులు కోస్గి మండలం ముక్తిపాడ్ గ్రామ పరిధిలో 19, 20, 50, 51 సర్వే నంబర్లలో మొత్తం 48.03 ఎకరాలు ఉన్నట్లు ఆధారాలు అందజేశారు. ఇదే క్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ రికార్డులను సైతం తీసుకున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఇనాంతోపాటు పలుమార్పులు, చేర్పులు చేసినట్లు గుర్తించి వివరాలు తీసుకున్నారు. వక్ఫ్ బోర్డు వివరాలు, రెవెన్యూ వివరాలతో సమగ్ర నివేదిక తయారు చేసి వక్ఫ్‌బోర్డు సీఈఓతోపాటు కలెక్టర్‌కు అందజేస్తామని అధికారుల బృందం ఈ సందర్భంగా తెలిపారు. ఇందులో తహసీల్దార్‌తోపాటు ఆర్ఐ సుభాష్‌రెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- తప్పులకు అవకాశం లేకుండా చూడాలి
- అధికారులకు సూచించిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట రూరల్: అధికారులు, రాజకీయపార్టీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితాను పారదర్శకంగా సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సాధారణ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఓటరు జాబితాలో తప్పులు లేకుండా సిద్ధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చివరి క్షణంలో ఓటరు తన పేరులేదని ఫిర్యాదు రాకుండా చూడాలన్నారు. అదేవిధంగా డబుల్ ఎంట్రీలు, చనిపోయిన వ్యక్తులు, పూర్తిగా ఆ బూత్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తుల పేర్లు తొలగించకుండా ఉంచడం సరికాదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక బోగస్ ఓట్లు ఉన్నాయని ఫిర్యాదులు చేయకుండా ముందుగానే సరిచూసుకోవాలన్నారు. సంబంధిత మండల తహసీల్దార్లు బీఎల్‌ఓలను చైతన్యపర్చాలని, తప్పులకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రాంచందర్, తహసీల్దార్ దానయ్య, డీటీలు మధుసూదన్, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధాన్యం బిల్లులు వెంటనే చెల్లించాలి..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శనివారం కలెక్టర్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్రీహర్ష, అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు వివరాలు తెలియజేశారు. ఇంకా ప్రారంభించని కేంద్రాల్లో ధాన్యం కొనేందుకు చర్యలు చేపట్టాలన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని, ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కంటివెలుగు, ఆరోగ్య మహిళ, డబుల్ బెడ్ రూం, జీఓ 58, 59, 76, 118 అమలుకు సంబంధించి చర్చించారు.

ఇంటి దొంగల వల్లే ఆలస్యం

- జూలై 15 నాటికి 'పాలమూరు' పూర్తిచేయిస్తాం
- నీటి కేటాయింపుల లోబడే ప్రాజెక్టు నిర్మాణం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి
- సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్‌తో కలిసి ప్రాజెక్టు పనుల పరిశీలన



కర్వెన రిజర్వాయర్ కాల్వను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, స్మితా సబర్వాల్, కలెక్టర్లు, ఇంజనీర్లు

వనపర్తి/ కొల్లాపూర్/ కొల్లాపూర్ రూరల్/ కోడేరు/ భూత్పూర్: కొందరు ఇంటి దొంగలు, ఇతర ప్రాంతాల వారు కేసులు వేయడం వల్లనే పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు ఆలస్యమయ్యాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. అన్ని సమస్యలను అధిగమించి కృష్ణానదికి వరద వచ్చే సమయానికి పనులు పూర్తి చేయించి దశాబ్దకాలం నాటి ప్రజల కల నెరవేర్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు శనివారం మంత్రి నిరంజన్‌రెడ్డి, సీఎంఓ కార్యదర్శి స్మితాసబర్వాల్‌తో కలిసి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చేపడుతున్న ఎల్లూరు, ఏదుల, కర్వెన రిజర్వాయర్లు, తీగలపల్లిలోని రెండో లిఫ్టును పరిశీలించారు. ఎల్లూరు వద్ద సర్జ్‌పూల్ హెడ్ రెగ్యులేటరీ, ఎలక్ట్రో మెకానికల్ వర్క్స్, కంట్రోల్ రూం ఏర్పాటు, పంపు మోటార్ల బిగింపు గురించి ఆరాతీశారు. అనంతరం ఏదుల రిజర్వాయర్ క్యాంపు ఆఫీస్ వద్ద ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రెండున్నర నెలల్లో పనులు పూర్తిచేసి ట్రయల్స్ ప్రారంభిస్తామన్నారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి 20 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు కృష్ణాజలాల కేటాయింపుల్లో స్పష్టత లేదన్నారు. తెలంగాణ ఏర్పడి తొమ్మిదేళ్లు గడుస్తున్నా.. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటా తేల్చడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి 2015లో శంకుస్థాపన చేశామని, అయితే కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడం, కావాలని ఆటంకాలు సృష్టించడం వల్లే పనులు పూర్తిచేయడంలో ఆలస్యమైందని మంత్రి వివరించారు. కేటాయింపుల ప్రకారం ప్రస్తుతం 21 నియోజకవర్గాలకు తాగునీటి అవసరాలు తీర్చేలా పనులు జరుగుతున్నాయని, రెండున్నర నెలల్లో పూర్తిచేసి ఎత్తిపోతలు చేపడతామన్నారు. ప్రాజెక్టు పనుల పరిశీలన బృందంలో ఎంపీ రాములు, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్, వనపర్తి కలెక్టర్లు ఉదయ్‌కుమార్, తేజస్ నందలాల్ పవార్, ఎమ్మెల్యేలు హర్షవర్ధన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్‌రావు, సలహాదారు పెంటారెడ్డి, సీఈ హమీద్‌ఖాన్, ఎస్ఈ విజయ్‌భాస్కర్, ఈఈలు పార్థసారథి, శ్రీనివాసరెడ్డి, ఏజెన్సీ ప్రతినిధి ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.



ఏదుల రిజర్వాయర్ టన్నెల్‌ను పరిశీలిస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి, స్మితా సబర్వాల్, కలెక్టర్లు, ఇంజనీర్లు

పనుల్లో వేగం పెంచాలి..

సీఎంఓ కార్యదర్శి స్మితా సబర్వాల్ మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం రోజువారీ పనులను చేపట్టాలని, సర్జ్‌పూల్ హెడ్ రెగ్యులేటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, కంట్రోల్ యూనిట్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఏమైనా సమస్యలుంటే కలెక్టర్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. నార్లాపూర్ రిజర్వాయర్‌కు అనుసంధానంగా చేపట్టిన కెనాల్ పనులను నిర్ణీత సమయంలోగా పూర్తిచేయాలన్నారు. వట్టెం రిజర్వాయర్ 90 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 10 శాతం పనులను 3 నెలల్లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. 12వ ప్యాకేజీ పనుల దగ్గర ఉన్న మిషన్ భగీరథ కెనాల్‌కు హైడ్రాలిక్ గేట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు చెప్పారు.

చదువుతోపాటే క్రీడలు

మక్తల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు కూడా నేర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి లియాకత్ అలీ అన్నారు. జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు డీవైఎస్ఓ కృష్ణమాచారితో కలిసి శనివారం మక్తల్‌లో సన్మానం చేసి మెమెంటో అందజేశారు. అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ నర్సింహగౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఐలయ్య, కాంగ్రెస్ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, పీఈటీలు రూప, అంబ్రేస్, సాయినాథ్, రమేష్, యాదయ్య, కృష్ణయ్య, పవన్, అనిల్, శ్రీలత, స్వప్న, సునీత, దాదాపు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యక్తి బలవన్మరణం

నాగర్‌కర్నూల్ క్రైం: క్షణికావేశంలో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన పుర పరిధిలోని నాగనూలులో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఉస్సేన్ (40) కూలీ పనులు చేసుకొని జీవనం సాగించేవాడు. మద్యం తాగడం మానుకోవాలని భార్య మందలించడంతో క్షణికావేశానికి గురై ఇంట్లో ఉరేసుకొని మృతిచెందాడు. గుర్తించిన కుటుంబసభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసును మోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

కొత్తకోట: మండలంలోని కనిమెట్ట సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై ఫుడ్ పిరమిడ్ దగ్గర కంటైనర్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో డ్రైవర్ దివాన్‌ఖాన్ (40) అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కర్నూలు నుంచి హైదరాబాద్ వెళ్తున్న కంటైనర్ కనిమెట్ట సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని చిన్న బ్రిడ్జిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ రాజస్థాన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ వివరించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల: తాగుడుకు బానిసైన ఓ యువకుడు భార్యతో గొడవపడి క్షణికావేశంలో పురుగు మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని నసరుల్లాబాద్‌తండాలో చోటుచేసుకుంది. సీఐ రమేశ్ బాబు కథనం ప్రకారం.. తండాకు చెందిన నేనావత్ ప్రదీప్(27) ఈ నెల 2న తన భార్య సుశీలతో కలిసి అత్తగారి ఊరు గౌరారంతండాలో ముత్యాల పండుగకు వెళ్లాడు. తర్వాత 4న ప్రదీప్ ఒక్కడే ఇంటికి తిరిగి వచ్చాడు. శుక్రవారం జడ్చర్లకు వచ్చిన ప్రదీప్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి తాను పురుగు మందు తాగి చికిత్స కోసం బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చినట్లు చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి రాగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై తమ కుమారుడు తాగుడుకు బానిసగా మారి భార్యతో గొడవ పడి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రదీప్ తల్లి ఉమ్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కళాకారుడు ముత్యాల వెంకటరత్నం మృతి



జడ్చర్ల టౌన్: బాదేపల్లి పట్టణానికి చెందిన సీనియర్ పౌరాణిక నాటక కళాకారుడు కొట్టె ముత్యాల వెంకటరత్నం నాయుడు (74) అనారోగ్యంతో శనివారం ఆయన స్వగృహంలో మృతిచెందాడు. దాదాపు 350కిపైగా పౌరాణిక నాటకాలు వివిధ పాత్రలు పోషించి అధికారులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సన్మానం పొందాడు. ఆయన మృతిపట్ల రాష్ట్ర సంగీత నాటక అకాడమీ మాజీ చైర్మన్ బి.శివకుమార్ సంతాపం వ్యక్తం చేశారు. నాటక రంగ దురంధరుడిగా పేరుగాంచిన ముత్యాల వెంకటరత్నం నాయుడు మృతి నాటక రంగానికి తీరని లోటుగా అభిప్రాయపడ్డారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నాటక రంగంలో అనేక పాత్రలు పోషించిన ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని నాటక కళాకారులు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే, ఓ కుమారుడు అమెరికాలో ఉండటంతో ఆయన రాక నిమిత్తం సోమవారం బాదేపల్లి పట్టణంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇంటింటికి తిరిగి ముత్యాల వ్యాపారం చేయటంతో ముత్యాల వెంకటరత్నంగా పేరు గాంచారు.

మట్టి తరలింపు అడ్డగింత

బాలానగర్: మండలంలోని పెద్దాయపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమిలో నుంచి శనివారం మొరం మట్టి తరలిస్తుండగా.. గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారికి ప్రక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో ఇదంతా జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ, తహసీల్దార్ కార్యాలయం నుంచి, మైనింగ్ అధికారుల నుంచిగాని ఎలాంటి అనుమతి తీసుకోకుండా రూ.లక్షల విలువైన మట్టిని అక్రమంగా తరలిస్తున్నారన్నారు. మట్టి తరలిస్తున్న వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని, ఈ సంఘటనపై ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామ యువకులు పేర్కొన్నారు.



బాస్కెట్‌బాల్ సిస్టర్స్

- రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తున్న జ్యోతి, ప్రియాంక



సీనియర్ నేషనల్ రన్నరప్ ట్రోఫీతో జ్యోతి

ట్రోఫీతో కె.ప్రియాంక

లోకల్ టాలెంట్

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాలోని కోయిలకొండ మండలం కేశ్వాపూర్ పెద్దతండాకు చెందిన అక్కాచెల్లెళ్లు కె.జ్యోతి, కె.ప్రియాంక బాస్కెట్‌బాల్‌లో మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లా జట్టులో ప్రధాన క్రీడాకారిణులుగా రాణిస్తున్నారు. కొన్నేళ్లుగా జిల్లా స్టేడియంలో కోచ్ ఎండీ ఖలీల్ వద్ద శిక్షణ తీసుకొని ప్రస్తుతం స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య అభ్యసిస్తూ మేటి క్రీడాకారులుగా ఎదిగారు.

12 సార్లు జాతీయస్థాయి పోటీల్లో..

జ్యోతి బాస్కెట్‌బాల్‌లో మెరుగ్గా రాణిస్తుంది. 12 సార్లు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2015లో పంజాబ్‌లో జరిగిన జూనియర్ నేషనల్, వరంగల్‌లో జరిగిన జాతీయ ఆర్‌జీకేఏ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొంది. 2016లో కర్ణాటకలో జరిగిన యూత్, ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జూనియర్ నేషనల్ టోర్నీ, హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు తరఫున ఆడింది. 2018 పంజాబ్ రాష్ట్రం లుథియానా, 2019 ఢిల్లీలో జరిగిన అండర్–19, లుథియానాలో జరిగిన సీనియర్ నేషనల్ పోటీల్లో పాల్గొంది. చెన్నైలో 2022లో జరిగిన సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ మహిళా జట్టుకు జ్యోతి ప్రాతినిధ్యం వహించింది. ఆ టోర్నీలో తెలంగాణ జట్టు రన్నరప్‌గా నిలిచింది. జ్యోతి ఇప్పటివరకు 25కుపైగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించి సత్తా చాటింది. పదిసార్లు జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించింది. బాస్కెట్‌బాల్‌లో విశేష ప్రతిభతో జ్యోతికి చెన్నైలోని ఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కాలేజీలో స్పోర్ట్స్ కోటాలో బీఈ–ఈసీఈ చివరి సంవత్సరం చదువుతోంది. 2021లో అన్న యూనివర్సిటీ తరఫున కేరళలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంది.

అంతర్జాతీయస్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం

చిన్నప్పటి నుంచి ఆటలంటే ఎంతో ఇష్టం. బాస్కెట్‌బాల్‌లో అంతర్జాతీయస్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించాలన్నదే లక్ష్యం. తల్లిదండ్రుల ప్రోత్సాహం, కోచ్‌ల శిక్షణలో జాతీయస్థాయికి ఎదిగాం. పట్టుదలతో ఆడి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధిస్తాం.

– జ్యోతి, ప్రియాంక

అక్క బాటలోనే చెల్లి

ప్రియాంక 2014లో ఖమ్మంలో తన తొలి రాష్ట్రస్థాయి టోర్నీలో జిల్లాకు ప్రాతినిధ్యం వహించింది. ఇప్పటి వరకు 25కుపైగా రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంది. అక్క జ్యోతితో కలిసి పలు సార్లు రాష్ట్రస్థాయి టోర్నీలో ఆడింది. మూడు సార్లు జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంది. 2017 ఢిల్లీలో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి టోర్నీలో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించింది. 2018లో ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా నేషనల్ గేమ్స్‌లో బాస్కెట్‌బాల్ అండర్–17 విభాగానికిఎంపికైంది. ఉమ్మడి జిల్లా నుంచి బాస్కెట్‌బాల్ క్రీడలో ప్రియాంక చోటు దక్కించుకొని ఢిల్లీలో జరిగిన ఖేలో ఇండియా క్రీడల్లో పాల్గొంది. 2019 ఢిల్లీలో జరిగిన అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో ఆడింది. ప్రియాంక స్పోర్ట్స్ కోటాలో చెన్నైలోని కోయంబత్తూర్‌లోని హిందుస్తాన్ యూనివర్సిటీలో బీబీఏ చదువుతోంది. ఈ ఏడాది ఆ యూనివర్సిటీ తరఫున జనవరిలో తమిళనాడులో జరిగిన సౌత్‌జోన్ నేషనల్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొంది.



← రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో జిల్లా తరఫున ఆడుతున్న జ్యోతి, ప్రియాంక వృత్తంలో (ఫైల్)

36వ జాతీయ క్రీడల్లో స్వర్ణ పతకం...

గుజరాత్ భావ్‌నగర్‌లో గతేడాది అక్టోబర్‌లో 36వ జాతీయ క్రీడల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి జ్యోతి ప్రాతినిధ్యం వహించింది, బాస్కెట్‌బాల్ టోర్నీలో తెలంగాణ మహిళా జట్టు స్వర్ణ పతకం సాధించింది. ప్రతిష్టాత్మకమైన జాతీయ క్రీడల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి జ్యోతి స్వర్ణ పతకం సాధించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

మహిళ దారుణ హత్య



ఎల్లమ్మ (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: కత్తితో పొడిచి మహిళను దారుణంగా హతమార్చిన ఘటన జిల్లాకేంద్రంలోని నెల్లికొండ క్రాస్‌రోడ్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు.. తాడూరు మండలం పొల్మూరుకు చెందిన ఎల్లమ్మను అదే మండలంలోని చెర్ల ఇటిక్యాలకు చెందిన వెంకటయ్యకు ఇచ్చి 13 ఏళ్ల కిత్రం వివాహం జరిపించారు. అనంతరం ఆరేళ్ల కిందట ఎల్లమ్మకు తుమ్మలసూగూరుకు చెందిన బాలకృష్ణతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధంగా మారింది. ఈ విషయం ఇంట్లో తెలియడంతో పద్ధతి మార్చుకోవాలని ఎల్లమ్మను మందలించారు. అయినా ఏడాది క్రితం ఎల్లమ్మ బాలకృష్ణతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లి 15 రోజుల కిందట తిరిగి వచ్చింది. ఇటీవల బాలకృష్ణ, ఎల్లమ్మ మధ్య డబ్బుల వివాదం తలెత్తడంతో కక్ష పెంచుకున్న బాలకృష్ణ పని నిమిత్తం జిల్లా కేంద్రానికి తల్లితో కలిసి వచ్చిన ఎల్లమ్మను శనివారం మధ్యాహ్నం బైక్‌పై ఎక్కించుకొని నెల్లికొండ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ప్లాట్లలోకి తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న కత్తితో విచక్షణారహితంగా పొడిచి హత్య చేశాడు. అక్కడే ఉన్న తల్లి కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకొని రక్తపు మడుగులో ఉన్న ఎల్లమ్మను జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. విషయం పోలీసులకు తెలియడంతో ఘటన స్థలాన్ని పరిశీలించడంతో పాటు నిందితుడు బాలకృష్ణను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఎల్లమ్మకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

'పది' పాస్ కాలేమోనని బెంగతో..

విద్యార్థిని ఆత్మహత్య



మాధవి (ఫైల్)

పెంట్లవెల్లి: ఇటీవల రాసిన పదో తరగతి పరీక్షల్లో పాస్ కాలేనేమోననే బెంగతో ఓ విద్యార్థిని ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన పెంట్లవెల్లిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పెంట్లవెల్లికి చెందిన జంగిటి ఎల్లయ్య, చిట్టెమ్మ దంపతులు చేపలు పట్టి ఉపాధి పొందుతున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు కాగా చిన్న కుమార్తె మాధవి(15) హైదరాబాద్‌లోని నాంపల్లి గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఇటీవల పది పరీక్షలు రాసి ఇంటికి వచ్చింది. తల్లిదండ్రులు తన చదువు కోసం ఎంతగానో ఖర్చు చేస్తున్నారని, తాను మాత్రం పదో తరగతిలో పాస్ అవుతానో.. లేదోనని బాధ పడేది. ఈ క్రమంలోనే శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు.

గాయానికి ఫెవిక్విక్‌తో కుట్లు.. ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు



రెయిన్‌బో ఆస్పత్రిని సీజ్ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప తదితరులు

అయిజ: దెబ్బ తగిలిన కంటికి కుట్లు వేయకుండా ఫెవిక్విక్ పూసిన ప్రైవేట్ ఆస్పత్రిని జిల్లా వైద్యాధికారులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప వెల్లడించారు. కర్ణాటకకు చెందిన వంశీకృష్ణ, సునీత దంపతుల కుమారుడు ప్రవీణ్‌చౌదరి బంధువుల పెళ్లి కోసం అయిజకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం ప్రవీణ్‌చౌదరి ఆడుకుంటూ కిందపడగా కంటిపై భాగాన చిన్న గాయమైంది. వెంటనే స్థానిక రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స చేయించగా.. వైద్యుడు బయోసిల్‌కు బదులు గాయంపై ఫెవిక్విక్ వేశారని బాలుడి తండ్రి వంశీకృష్ణ ఆస్పత్రి డాక్టర్ నాగార్జునతో వాగ్వాదం చేశారు. నేను చెప్పింది బయోసెల్ అని కాంపౌండర్ ఫెవిక్విక్ వేసిన విషయం తెలిదని, దాని వలన ఎలాంటి నష్టం జరగదని, భవిష్యత్‌లోనూ పిల్లవాడికి ఎలాంటి నష్టం వాటిల్లినా బాధ్యత వహిస్తానని చెప్పారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సిద్ధప్ప, జిల్లా ఆస్పత్రి చిన్నపిల్లల స్పెషలిస్టు శ్యాం, ఇన్‌చార్జ్ ప్రోగ్రాం ఆఫీసర్ స్రవంతి, స్పెషల్ ఆఫీసర్ తిరుమలరెడ్డి, డిప్యూటీ డెమో మధుసూదన్‌రెడ్డి రెయిన్‌బో ఆస్పత్రిలో విచారణ జరిపారు. రికార్డులను పరిశీలించి.. వైద్యుడు నాగార్జునను అడిగి వివరణ తీసుకున్నారు. అలాగే ఆస్పత్రిని సీజ్ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశానుసారం విచారణ చేశామన్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి వైద్యుడిని వివరణ అడిగామని, ఆయన రాతపూర్వకంగా వివరణ ఇచ్చిన అనంతరం మరోసారి విచారణ జరిపి తదుపరి ఆస్పత్రి నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విష్ణు, ఎంపీహెచ్‌ఈఓ ఓబులేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దేవరకద్ర ఆర్వోబీ ప్రారంభం



ఆర్వోబీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు

దేవరకద్ర: పట్టణంలో రూ.24 కోట్లతో నిర్మించిన ఆర్వోబీని సోమవారం ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాష్ట్ర ఆర్‌అండ్‌బీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి కార్యక్రమానికి హాజరవుతారని ఎమ్మెల్యే తెలిపారు. చిన్న పని కూడా పెండింగ్‌లో లేకుండా చూడాలని ఆదేశించారు. దశాబ్దాల నాటి కల నెరవేరబోతుందని రైల్వే గేటు కష్టాలు తొలగిపోనున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే దేవరకద్రలో రూ.కోటితో నిర్మించిన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సైతం మంత్రులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక శ్రీనివాస గార్డెన్‌లో జరిగే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ సంధ్య, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్, శివానంద్, బాలరాజు, సత్యం, హన్మంతు, బాలగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరు మృతి



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి డీకే అరుణ

ఎర్రవల్లిచౌరస్తా: కంటి ఆస్పత్రికి వెళ్లి వస్తూ జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఒకరు మృతిచెందగా.. మరొకరు గాయాల పాలైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్‌ఐ గోకారి కథనం మేరకు.. గద్వాల మండలం లత్తీపురం గ్రామానికి చెందిన సత్యారెడ్డి, అక్క లచ్చమ్మ (65) కలిసి ద్విచక్ర వాహనంపై కర్నూలులోని కంటి ఆస్పత్రికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా.. ఎర్రవల్లి సమీపంలో జాతీయ రహదారిపై పుల్లారెడ్డి పెట్రోల్ బంక్ దగ్గర బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. లచ్చమ్మ మార్గమధ్యంలోనే మృతి చెందింది. సత్యారెడ్డిని చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. లచ్చమ్మ భర్త అయ్యపురెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

మాజీ మంత్రి డీకే అరుణ పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన లచ్చమ్మ కుటుంబ సభ్యులను గద్వాల ఆస్పత్రిలో మాజీ మంత్రి డీకే అరుణ పరామర్శించారు. ఆమె వెంట బీజేపీ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, బండల వెంకట్రాములు, రాజశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ దేశానికే తలమానికం



వర్షంలోనే కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ అడవిలో సఫారీ రైడ్‌కి వెళుతున్న మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



సంప్రదాయ తరహాలో స్వాగతం పలుకుతున్న మహిళలు

- జంగిల్ సఫారీ ప్రారంభించిన మంత్రి కేటీఆర్

పాలమూరు: మహబూబ్‌నగర్ సమీపంలో ఉన్న కేసీఆర్ ఎకో అర్బన్ పార్క్‌లో 26 వేల ఎకరాలలో జంగిల్ సఫారీని చేపట్టడం అద్భుతం అని రాష్ట్ర ఐటీ మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. మహబూబ్‌నగర్ అప్పన్నపల్లి సమీపంలో ఉన్న కేసీఆర్ అర్బన్‌పార్క్‌లో జంగిల్ సఫారీని శనివారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో కలిసి అడవిలో సఫారీ నిర్వహించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌కు ఉదయం ఎండలో వస్తే సాయంత్రం చల్లబడటమే కాకుండా, చిన్నపాటి వర్షంతో ఆహ్లాదకరంగా ఉందని, ప్రశాంత వాతావరణంలో సఫారీ ఎంతో ఉల్లాసాన్ని కలిగించిందన్నారు. కేసీఆర్ ఎకో పార్క్‌లో అడ్వెంచర్ కార్యక్రమాలతో పాటు పిల్లలు, పెద్దలు అందరికీ ఆహ్లాదం, వినోదం కలిగించేలా ఏర్పాటు చేయడంపై మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను అభినందించారు. ఇంత పెద్ద ఎకో పార్క్ ఉండటం దేశంలోనే అరుదని కితాబు ఇచ్చారు. అనంతరం మంత్రి అడవిలో బ్రిటీష్ కాలంలో నిర్మించిన గోల్ బంగ్లాను సందర్శించి అక్కడ మ్యాప్ ద్వారా 26వేల అటవీ విస్తీర్ణాన్ని పరిశీలించారు. అలాగే పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న కర్వెన, ఉదండపూర్ రిజర్వాయర్ల ఫొటోలు, మ్యాప్‌లను పరిశీలించారు.



అర్బన్ పార్క్‌లో ఫొటో ప్రదర్శనను పరిశీలిస్తున్న మంత్రులు



శిల్పారామంలోని స్టాల్స్‌లో వర్తకుడితో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

వేరుశనగ క్వింటా రూ.7,149

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో శనివారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,149, కనిష్టంగా రూ.4,060 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,821, కనిష్టంగా రూ.1,410, ఆముదాలు గరిష్టంగా రూ.5,610, కనిష్టంగా రూ.5,260, హంస గరిష్టంగా రూ.1,892, కనిష్టంగా రూ.1,456, ఆర్‌ఎన్‌ఆర్‌కు గరిష్టంగా రూ.2,342, కనిష్టంగా రూ.1,669, పత్తి గరిష్టంగా రూ.7,159, కనిష్టంగా రూ.7,119, రాగులు గరిష్టంగా రూ.2,369, కనిష్టంగా రూ.1,853, పెబ్బర్లు రూ.4,510, మినుములు రూ.5,921 ఒకే ధర పలికాయి.

సోనామసూరి ధర రూ.2,083

దేవరకద్ర మార్కెట్ యార్డులో శనివారం జరిగిన ఈనామ్ టెండర్లలో సోనామసూరి ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.2,083, కనిష్టంగా రూ.1,479గా చొప్పున వచ్చాయి.

క్లుప్తంగా

తాగునీటి బోరు ప్రారంభం



మక్తల్: మండలంలోని కొత్తగార్లపల్లిలో శనివారం తాగునీటి కోసం వేయించిన బోరును వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి ఇబ్బంది ఉందని గ్రామస్తులు తెలియజేయడంతో వెంటనే స్పందించి ఆయన బోరు వేయించి మోటార్ అందజేశారు. అయితే శనివారం మోటార్‌ను అమర్చి ప్రారంభించారు. తాగునీటి కోసం రూ.లక్ష ఖర్చు చేశారని గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు ఆయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, ఆటో అశోక్, రమేష్, భరతసింహారెడ్డి, శేఖర్, బాలప్ప, బీరప్ప తదితరులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

మాగనూర్: చీఫ్ మినిస్టర్ కప్ – 2023లో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15ఏళ్ల నుంచి 36ఏళ్ల వయస్సు గల యువత క్రీడాపోటీల్లో పాల్గొనాలని సూచించారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్(యువకులకు), కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహిస్తామని, ఆసక్తి గల వారు ఈ క్రీడల్లో పాల్గొన్నారు.

పాముకాటుకు కాడెద్దు మృతి



ఊట్కూరు: పాముకాటుతో కాడెద్దు మృతి చెందిన ఘటన శనివారం మల్లెపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అంజప్ప అనే రైతు వేసవి దుక్కులు దున్నేందుకు తెల్లవారుజామున పొలానికి కాడెద్దులను తీసుకెళ్లాడు. పొలం దున్నుతుండగా ఒక ఎద్దు అకస్మాత్తుగా కిందపడి ప్రాణాలు వదిలేసింది. ఎద్దును పరీక్షించగా కాలికి పాముగాట్లు కనిపించాయి. దీంతో సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు, స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని మన్నాపూర్ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కొత్తపల్లి తహసీల్దార్ లతారెడ్డి శనివారం పట్టుకొని సీజ్ చేశారు. మన్నాపూర్ గ్రామానికి చెందిన కృష్ణయ్య ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నాడన్న సమాచారం మేరకు తనిఖీ నిర్వహించి సీజ్ చేశామని ఆమె తెలిపారు. ఈ విషయంపై కలెక్టర్ కార్యాలయానికి సమాచారం అందించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

ఘనంగా మాత మాణికేశ్వరి విగ్రహం ఊరేగింపు



మరికల్: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మాత మాణికేశ్వరి ఆలయంలో ప్రతిష్ఠించే అమ్మవారి విగ్రహంతో పాటు పలు దేవత విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారి విగ్రహంతో ఊరిగింపుగా వెళ్లగా భక్తులు దారిపొడవునా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శించుకున్నారు. ఆదివారం విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ముగిసిన సత్యనారాయణ స్వామి జాతర

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో కొలువుదీరిన సత్యనారాయణ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు కొనసాగిన జాతర వేడుకలను శనివారం ముగిశాయి. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, స్వామివారికి అర్చకులు వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం విష్ణుసహస్రనామ హోమం చేపట్టారు.

నిబంధనలకు విరుద్ధంగా..



ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర నిలిపిన చెత్తవాహనాలు

- చెత్త వాహనాలు నిలిపివేత
- దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ దగ్గరలోని రోడ్డుకు ఇరు వైపులా చెత్త సేకరించే వాహనాలను నిబంధనలు విరుద్ధంగా నిలుపుతున్నారు. పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సేకరణ వాహనాల్లో మిగిలిన వ్యర్థాల వల్ల దుర్వాసన కంపు కొడుతుందని పలువురు వాపోతున్నారు. వార్డులలో వ్యర్థాలను సేకరించే చెత్తవాహనాలను మున్సిపల్ కార్యాలయం రహదారికి ఇరువైపులా నిలపడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని జూనియర్ కళాశాల అధ్యాపకులు మున్సిపల్ కమిషనర్‌కు గతంలో వినతి పత్రం అందించినా ఉపయోగం లేదు. చెత్త సేకరణ చేపట్టి డంపింగ్ యార్డుకు తరలించిన అనంతరం వాహనాలను శుభ్రం చేపట్టకుండా మున్సిపల్ కార్యాయలం దగ్గరలోనే చెత్తవాహనాలు నిలపడంతో కంపువాసన వెదజల్లుతోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చే పట్టణవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

దుర్వాసనతో పాటు దోమల బెడద...

సేకరించిన చెత్తను పూర్తిస్థాయిలో డంపింగ్ చేయకపోవడంతో వాహనంలో మిగిలి ఉన్న చెత్తపై దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పరుచుకుంటున్నాయి. దీంతో వాహనాల పక్కన నుంచి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఇకనైనా చెత్తవాహనాలు నిలపకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్త వాహనాల నుంచి దుర్వాసన..

మున్సిపల్ కార్యాలయం వద్ద చెత్తవాహనాల నిలపడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దుర్వాసనతో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చెత్త సేకరణ వాహనాలు పట్టణానికి దూరంగా నిలిపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నరహరి, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి, నారాయణపేట

మరోచోటకు వాహనాలు తరలిస్తాం...



జిల్లా కేంద్రంలో రోడ్డు విస్తరణ పనుల వల్ల చెత్త సేకరణ వాహనాలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిలుపుతున్నారు. పాత మున్సిపల్ కార్యాలయం ఆవరణలో చెత్తాచెదారం ముళ్లపొదలు తొలగించి అక్కడే చెత్త వాహనాలు నిలిపేందుకు చర్యలు తీసుకుంటాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

మత్స్యకార సహకార సంఘం ఎన్నికలకు నామినేషన్

మక్తల్: స్థానిక మత్స్యకార సంఘం ఎన్నికలకు శనివారం నామినేషన్ పక్రియ ప్రారంభమైంది. సోమ, మంగళవారాల్లో నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల అధికారి లావణ్య తెలిపారు. నామినేషన్లు వేసేందుకు తుది గడువు మంగళవారంతో ముగుస్తుందని తెలిపారు. 11వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ చేసేందుకు చివరి గడువు ఉంటుంది. 9 డైరెక్టర్ పోస్టులకు అధిక సంఖ్యలో నామినేషన్లు దాఖలు అయితే 16వ తేదీన పోలింగ్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కోళ్ల వెంకటేష్, వాకటి అంజయ్య, కావాలి శ్రీహరి, సుకన్య చంద్రశేఖర్, లక్ష్మణ్, అంజనేయులు, రేణుక నర్సింహ, శ్రీహరి, శ్యామ్, నరేందర్, శివశంకర్, అశోక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చక్రస్నానంతో ముగిసిన ఉత్సవాలు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని పరిమళాపురంలో వెలిసిన రాఘవేంద్ర సహిత లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్వామి ఉత్సవాలు చక్రస్నానంతో శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా స్వామివారి మూల విరాట్ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీ ఊరేగించారు. భక్తులు భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



వంటావార్పుతో జేపీఎస్‌ల నిరసన



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం జేపీఎస్, ఓపీఎస్‌లు సమ్మెలో పాల్గొని ఫ్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అరుణోదయ కళాకారుల బృందం సభ్యులు వారికి మద్దతు తెలిపి ఆట పాటలతో వారిని ఉత్సాహపరిచారు. మధ్యాహ్నం రోడ్డుపై వంటావార్పు చేశారు. అదేవిధంగా బీజేపీ నాయకులు రతంగపాండురెడ్డి, ప్రభాకరవర్ధన్, రఘురామయ్యగౌడ్‌లు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షులు శివకుమార్, శ్రీనివాస్, హరికృష్ణ, బుచ్చారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అంజి, జ్ఞానేశ్వరీ, ఖాదీర్, సౌందర్య, జ్యోతి,బబిత, నవిత, రవిందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

నారాయణపేట టౌన్: కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని ప్రకటించడాన్ని నిరసిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని గొడుగుగేరి ఆంజనేయ దేవాలయంలో పట్టణ వీహెచ్‌పీ, బజరంగ్ దళ్ నాయకులు సామూహికంగా హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. మేనిఫెస్టోలో బజరంగ్‌దళ్ నిషేధిస్తామని పొందుపరచడం దారణమన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు పాల్గొన్నారు.



నా జీవితం ప్రజాసేవకు అంకితం



జిల్లాపార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న రాజేందర్‌రెడ్డి



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి గజమాలతో సన్మానం

నారాయణపేటరూరల్: నారాయణపేటలో నిర్వహించిన కార్యక్రమంలో శనివారంఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి తన సతీమణి స్వాతిరెడ్డితో కలిసి హాజరయ్యారు. సింగారం చౌరస్తా నుంచి ధన్వాడ, మరికల్, కోయిలకొండ, దామరగిద్ద మీదుగా పట్టణానికి 150కార్లతో ర్యాలీ నిర్వహించారు. ఆయా మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీ, జెడ్పీటీసీల ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి, కేక్‌కట్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మూడేళ్లలో పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. నాయకులు వేపూరి రాములు, విజయ్‌సాగర్, అనసూయ, అమ్మకోళ్ల శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, గందె చంద్రకాంత్, కన్నజగదీష్, రమేష్‌గౌడ్, శ్రీపాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మరికల్: నా జీవితం ప్రజాసేవకు అంకితం చేస్తానని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. అంతకుముందు కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, సర్పంచ్ గోవర్ధన్, బసంత్, రాజవర్ధన్‌రెడ్డి, తిరుపతయ్య, రాజేష్, రామస్వామి, గోపాల్, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి, కార్యకర్తలకు తినిపించారు. పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తలు ఎమ్మెల్యేరు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, కోఆప్షన్ సభ్యులు వాహీద్, సర్పంచ్ అమరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొండారెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



మక్తల్‌లో ఊడ్చుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మక్తల్: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో 9వ రోజు నిరసన నిర్వహించారు. సీపీఐ ఎంఎల్, ప్రజాపంథా ఆధ్వర్యంలో సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం కార్యదర్శులు చీపుర్లతో ఎంపీడీఓ కార్యాలయ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఊడ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల కోసం తెచ్చిన జీఓ నుంచి 317 నుంచి ప్రభుత్వ అధికారులు నష్టపోయారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగాస్తుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం లేదని కార్యదర్శులు విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భుట్టో, వెంకట్‌రెడ్డి, ఈశ్వర్, అధ్యక్షుడు అశోక్‌గౌడ్, మధు, రవికుమార్, మహేష్, రాజ్యలక్ష్మి, జ్యోతి, అనిత, భగత్‌సింగ్, అనిత, నర్సిములు, సుమన్, బాలరాజు, కనకరాజు,కుర్వలింగప్ప, బాలకృష్ణ, కురుమూర్తి, శ్రావణి, శివయ్య, విష్ణు, వెంకటమ్మ, భుట్టో, వెంకట్‌రెడ్డి, ఎండీ సలీం తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: గ్రామాభివృద్ధిలో కీలక భూమిక పోషించే పంచాయతీ కార్యదర్శుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు మండల సర్పంచ్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నిరోజులుగా ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లలో కార్యదర్శులు నిరవధిక సమ్మె చేయడం వల్ల గ్రామాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను నిలిచిపోయ ప్రమాదం ఉందని గుర్తుచేశారు. వీరి సమ్మెకు మద్దతుగా మద్దూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన సర్పంచ్‌లు అందరు కలిసి రూ. 50 వేలు ఆర్థికసాయం అందజేశారు. సమ్మెలో భాగంగా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు మద్దూరు, కొత్తపల్లి, కోస్గి మండలాలకు చెందిన జేపీఎస్, ఓపీఎస్ కార్యదర్శులు చీపుర్లతో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణను ఊడ్చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు అరుణ, భవాని, తిరుపతి, షేక్ మీరాన్, నాయకులు హన్మిరెడ్డి, రాజశేఖర్, గోవిందు, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

కనులపండవగా నరసింహస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాగనూర్: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రథోత్సవ వేడుకలు కనులపండువగా నిర్వహించారు. ముందుగా స్వామివారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు మహారాష్ట్ర, కర్ణాటక, హైదారాబాద్ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. పలు పార్టీల నాయకులు స్వామి వారిని దర్శించుకున్ని మొక్కులు చెల్లించుకున్నారు.

పాలఉట్ల ఉత్సవం..

రథోత్సవం సందర్భంగా సాయంత్రం పాలఉట్ల ఉత్సవం వైభవంగా సాగింది. యువకులు పాల ఉట్ల స్తంభాన్ని ఎక్కేందుకు పోటీ పడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, జెడ్పీటీసీ వెంకటయ్య, ఎంపీపీ శ్యామలమ్మ, ఉపసర్పంచ్ సుధా, ఆలయ కమిటీ సభ్యులు జైపాల్‌రెడ్డి, వాకిటి శ్రీనివాసు, నరేష్, కృష్ణయ్య, సత్యప్ప, ఆనంద్, గ్రామస్తులు, ఆనంద్‌గౌడ్, వెంకటయ్య, చెన్నప్ప యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వర స్వామి రథోత్సవం

నారాయణపేట రూరల్: స్థానిక సరాఫ్‌బజార్‌లోని బసవేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి రథోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరుడు, వీరభద్రేశ్వరుడి మూల విరాట్‌లకు మంజునాథ్, విశ్వనాథ్ స్వామి పంచామృతాభిషేకం, బిల్వార్చన, పుష్పలంకరణ, మహామంగళహారతి పూజలు చేశారు. అర్ధరాత్రి భక్తుల కోలాహలం మధ్య రథోత్సవం జరిగింది. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాలింగం, వీరశైవ సమాజం సభ్యులు మంగళ్లి బస్సప్ప, మోర్లపల్లి జగదీష్, బాగోడి మల్లికార్జున్, శెట్టి రాజు, కన్న జగదీష్, జయప్రకాష్, వినోద్, రాజేష్, రవి, మణి, అప్పి, ఉదయ్‌కిరణ్, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కూలి రేట్లు పెంచాలి



మాట్లాడుతున్న సంఘం నాయకులు

ఊట్కూరు: ఉపాధి కూలీలకు రోజువారి కూలి రూ.600కు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కనకారాయుడు డిమాండ్ చేశారు. శనివారం పులిమామిడిలో ఉపాధి పనులు చేసే స్థలంలో సర్వే చేపట్టారు. కూలీలకు అందిస్తున్న కూలి రేట్లను, కొలతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయడం లేదని ఆరోపించారు. పులిమామిడిలోని రామలింగప్ప గుట్టకు పలువురు కూలీలు పనిచేసి ఆరు నెలలు అయిన కూలీ డబ్బులు ఖాతాలో జమకాలేదన్నారు. కూలీలకు కూలిరేట్లు గిట్టుబాటు కావడం లేదని, వేసవి కాలంలో భూమి గట్టిగా ఉన్నందున కొలతల ప్రకారం రూ.వంద లోపు కూలీ వస్తుందని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి కూలీలందరికీ రోజుకు రూ.600 చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరహరి, రమేష్, తిమ్మప్ప, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

యువ సంఘర్షణ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న నాయకులు

కోస్గి: నిరుద్యోగ యువతరానికి భరోసా ఇస్తూ హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరుతో నిర్వహిస్తున్న కాంగ్రెస్ యువ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 8న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ సభకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువత పట్ల వ్యవహరిస్తున్న తీరును ఎండగట్టి, యువతలో భరోసా నింపేందుకు చేపట్టిన ఈ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు బెజ్జు రాములు, పట్టణ అధ్యక్షుడు తుడుం శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సిములు, కౌన్సిలర్లు భాను నాయక్, ఇద్రీస్, నాయకులు నాగులపల్లి నరేందర్, నాచారం వెంకట్రాములు, ఇజాజ్, బాల్‌రాజ్, శివ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మి

ఊట్కూరు: మండలంలో వేలిముద్ర రాని వారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న గ్రామకార్యదర్శులు ఆసరా పింఛన్లు అందించాలని ఎంపీపీ ఎల్కోటి లక్ష్మి కోరారు. శనివారం మండల పరిషత్ భవనంలో అధికారులతో ఆసరా పింఛన్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుమారు 14 మంది గ్రామకార్యదర్శులు సమ్మెలో ఉన్నారని, దీంతో వేలిముద్ర రాని ఆసరా పింఛన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొత్తగా ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకున్న గ్రామ కార్యదర్శులు లబ్ధిదారులకు పింఛన్లు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆసరా డీపీఎం ఆనంద్, ఎంపీడీఓ కాలప్ప, ఏపీఎం నిర్మల, సీసీలు లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



రైతులను సన్మానిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ: యాసంగిలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని ప్రతి గింజను కొనుగోలు చేస్తామని నర్వ పీఏసీఎస్ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం నర్వ పీఏసీఎస్‌లో గతంలో రుణాలు తీసుకున్న రైతులు రుణాలు చెల్లించగా వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ధాన్యాన్ని కాంటా చేయడానికి రైతుల పొలాల వద్దకే లారీలు వస్తాయన్నారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులను అందిస్తున్నామని తెలిపారు. విక్రయించిన రైతులకు వారంలోగా డబ్బులు ఖాతాలో జమచేస్తారని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పెద్దకడ్మూర్ శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యారెడ్డి, మల్లేష్, శేఖర్‌రెడ్డి, రాములు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై ఎమ్మెల్యే జన్మదిన వేడుకలపై ఆందోళన



మరికల్: మండల కేంద్రంలో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించేందుకు శనివారం నిత్యం రద్దీగా ఉండే రహదారిపై టెంట్ ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో విషయం తెలుసుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు టెంట్ ఎదుట ఆందోళన చేశారు. టెంట్ తొలగించే వరకు ఆందోళన విరమించమని తెలపడంతో సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు పూర్తి అయిన తర్వాత నిరసనకారులను విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో సెల్‌ఫోన్ పట్టివేత



నారాయణపేట రూరల్: ఇటీవల నూతనంగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) టెక్నాలజీని ఉపయోగించి పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను శనివారం పోలీసులు గుర్తించారు. సీఐ రవిబాబు తెలిపిన వివరాల ప్రకారం బీసీ కాలనీకి చెందిన సయ్యద్ హుస్సేన్ సెల్‌ఫోన్ చోరీ అయ్యిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వెంటనే నంబర్‌ను బ్లాక్‌చేసి వెబ్‌సైట్‌లో ఎంటర్ చేశాం. ఐటీకోర్ టీమ్ సహాయంతో కొత్త టెక్నాలజీ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని సీఐ తెలిపారు. అనంతరం బాధితుడు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ శివకుమార్, ఆంజనేయులు, రాములు ఉన్నారు.

కలిసికట్టుగా మండలం సాధించుకుందాం



నారాయణపేట రూరల్: అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండల కేంద్రంగా చేయాలని సాధన సమితి నాయకుడు కెంచె శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ నెల 10 నుంచి చేపట్టనున్న రిలే దీక్షలను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం తిర్మలాపూర్, కోటకొండ గ్రామాల్లో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం సాధన కోసం అన్ని పార్టీల నాయకులతో కలిసి జేఏసీగా ఏర్పడ్డామని, అంతా కలిసి సమిష్టిగా పోరాడుదామన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్రాములు, రాజు, రాములు, వడెప్ప, హన్మంతు, హాజిమలాంగ్, చెన్నప్ప, ప్రవీణ్, దస్తప్ప పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల దీక్షలు



మక్తల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద వీఓఏలు చేస్తున్న దీక్ష శనివారం నాటికి 20వ రోజు చేరుకుంది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వీఓలకు ప్రతి నెల రూ.26 వేల వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పదోన్నతులు, ఐడీ కార్డులను ఇవ్వాలన్నారు. పనికి తగిన వేతనం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు అధికంగా పెరగడంతో తమ బతుకు దెరువు ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు బాలయ్య, కార్యదర్శి రాంరెడ్డి, కోశాధికారి జ్యోతి, చంద్రకళ, వెంకట్‌రాములు, బాలయ్య, రాంరెడ్డి, రాజు, రాము, సంతోష, శమంతకమణి, రాధమ్మ, వెంకటేష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగింపు సభకు తరలిరావాలి

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని సిటిజన్ క్లబ్ ఆవరణంలో ఆదివారం ఉదయం 11 గంటలకు మేడే వారోత్సవాల ముగింపు సభకు పట్టణ ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు వెంకట్రామిరెడ్డి, బాల్‌రాం, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు, సీఐటీయూ నాయకుడు శ్రీకాంత్‌లు హాజరవుతారని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

ముగిసిన అమ్మవారి వసంతోత్సవాలు

తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగిన పద్మావతి



అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుచానూరు(తిరుపతి జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారికి ఈ నెల 4వ తేదీన ప్రారంభించిన వార్షిక వసంతోత్సవాలు శనివారం రాత్రి మహాపూర్ణాహుతితో ముగిశాయి. వసంతోత్సవంలో భాగంగా శనివారం అమ్మవారిని వేకువజామునే సుప్రభాతంతో మేల్కొల్పి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారిని సన్నిధి నుంచి వేంచేపుగా ఉద్యానవనం మండపానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. అనంతరం నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి దివ్యాలంకార శోభితురాలైన శ్రీపద్మావతి అమ్మవారు తిరుచ్చిపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. వార్షిక వసంతోత్సవాలు పురస్కరించుకుని 3వ తేదీ నుంచి ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. వసంతోత్సవాలు ముగియడంతో ఆదివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలను పునరుద్ధరించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

బీజేపీ నేత విష్ణుకుమార్‌రాజుకు

షోకాజ్ నోటీస్?

- సంబంధం లేని వ్యాఖ్యలు చేసిన ఫలితం!

సాక్షి విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకు ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఓ టీవీ చానల్ ఇంటర్వ్యూలో విష్ణుకుమార్ రాజు సంబంధం లేని వ్యాఖ్యలు చేసినందుకు ఈ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. పార్టీ వర్గాల కథనం ప్రకారం.. విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలపై బీజేపీ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో క్రమశిక్షణ సంఘం ఆయనకు నోటీసు జారీ చేసింది. వ్యాఖ్యలపై ఆదివారం సాయంత్రంలోగా వివరణ ఇవ్వాలని, లేకుంటే సస్పెన్షన్‌కు గురికావలసి వస్తుందని హెచ్చరించింది. కేంద్ర దర్యాప్తు సంస్థలపై అసత్య ఆరోపణలు, ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశానికి పిలవకపోయినా పిలిచినట్లు ప్రస్తావిస్తూ అబద్ధపు మాటలు ఎలా చెబుతారని ఆగ్రహం వ్యక్తంచేసింది. పొత్తులపై స్థాయిని మరిచి మాట్లాడినందుకు వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గతంలో కూడా ఇటువంటి వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించామని ఆ నోటీసులో పేర్కొన్నట్లు తెలిసింది.

సెలవిక.. శత్రుంజయ!

సేవల నుంచి నిష్క్రమించనున్న 'ఐఎన్ఎస్ మగర్' యుద్ధ నౌక

1987 నుంచి 36 ఏళ్ల పాటు భారత నౌకాదళంలో కీలక పాత్ర

- విశాఖ కేంద్రంగా 29 ఏళ్ల పాటు సేవలందించిన నౌక
- 2004 సునామీ సమయంలో అండమాన్‌లో 1300 మందిని రక్షించిన మగర్
- ఎల్‌టీటీఈ ఆపరేషన్, కోవిడ్ కాలంలో ఆపరేషన్ సేతులో ముఖ్యభూమిక
- నేడు కొచ్చిలో ఐఎన్ఎస్ మగర్‌కు ఘన వీడ్కోలు పలకనున్న భారత నౌకాదళం



ఐఎన్ఎస్ మగర్ యుద్ధ నౌక

సాక్షి, విశాఖపట్నం: నీటిలోనే కాదు.. నేలపైనా దాడిచేసే స్వభావం ఉన్న మొసలి (మగర్) లక్షణాల్ని పుణికిపుచ్చుకున్న ఆ యుద్ధ నౌక వస్తుందంటే శత్రువుల వెన్నులో వణుకు పుట్టేది. ఆయుధ సంపత్తిని మోసుకొస్తున్న ఆ నౌక కనిపిస్తే చాలు.. శత్రు సైన్యంతో పోరాడుతున్న బలగాలకు కొండంత ధైర్యం పోగవుతుంది. ఆపదలో ఉన్నవారికి ఆత్మీయత పంచుతూ.. విపత్తులో ఉన్నవారిని ఒడ్డుకు చేర్చుతూ.. 36 ఏళ్లపాటు భారత నౌకాదళానికి సుదీర్ఘ సేవలందించిన ఐఎన్ఎస్ మగర్ ఆదివారంతో విధులకు స్వస్తి పలకనుంది. వార్‌ఫేర్ వెసెల్‌గా అంతర్జాతీయ విన్యాసాల్లో సత్తా చాటిన మగర్‌కు భారత నౌకాదళం ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికేందుకు సిద్ధమవుతోంది.

ఒడ్డుకు వచ్చి మరీ..

భారత నౌకాదళ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించిన ఉభయచర యుద్ధ నౌకల్లో కీలకమైనదిగా ఐఎన్ఎస్ మగర్ ఖ్యాతి ఆర్జించింది. విశాఖలోని హిందుస్తాన్ షిప్‌యార్డు సహకారంతో కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ)లో మగర్‌ని యాంఫిబియాస్ షిప్‌గా తీర్చిదిద్దారు. అంటే.. సాధారణంగా షిప్‌లు ఒడ్డు వరకూ రాలేవు. కానీ.. మగర్ మాత్రం ఒడ్డు వరకూ వచ్చి.. సైన్యానికి అవసరమైన ఆయుధ సంపత్తిని అందించగల సామర్థ్యాన్ని సొంతం చేసుకుంది. అందుకే.. దీనికి మగర్ (తెలుగులో మొసలి అని అర్థం) అనే పేరుపెట్టారు. 1987 జూలై 15న భారత నౌకాదళంలో ఈ షిప్ ప్రవేశించింది.

విశాఖ నుంచి సుదీర్ఘ సేవలు

తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నానికి ఐఎన్ఎస్ మగర్‌ని కేటాయించారు. ల్యాండింగ్ షిప్ ట్యాంక్(ఎల్ఎస్‌టీ) హోదాలో యుద్ధ ట్యాంకులు, ఆయుధాలు తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం. నలుగురు ల్యాండింగ్ క్రాఫ్ట్ వెహికల్ సిబ్బంది, అత్యవసర సమయంలో దళాల్ని మోహరించేందుకు మగర్ యుద్ధ నౌకను వినియోగించేవారు. శ్రీలంకలో ఎల్‌టీటీఈని నిరోధించే సమయంలో నిర్వహించిన ఆపరేషన్ పవన్‌లో మగర్ కీలక పాత్ర పోషించింది. నిరంతర పోరాటం చేసిన ఇండియన్ పీస్ కీపింగ్ ఫోర్స్(ఐపీసీకే)కు అవసరమైన సామగ్రిని అందించింది. వివిధ దేశాల్లో జరిగిన ద్వైపాక్షిక విన్యాసాల్లో మగర్ సత్తా చాటింది. 2006 ఫిబ్రవరి 22న విశాఖ తీరానికి 70 కి.మీ. దూరంలో మగర్ యుద్ధ నౌకలో ఘోర ప్రమాదం సంభవించింది. షిప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ముగ్గురు నావికులు మృతి చెందారు. మరో 19 మంది గాయాల పాలయ్యారు. 2018వ సంవత్సరం వరకూ విశాఖ కేంద్రంగా సేవలందించిన మగర్‌ను 2018 ఏప్రిల్‌లో కొచ్చికి తరలించి.. మార్పులు చేర్పుల అనంతరం మొదటి స్క్వాడ్రన్ శిక్షణ నౌకగా సేవలు అందించింది.

సునామీలో విశిష్ట సేవలు

మగర్ అందించిన సేవల్లో ముఖ్యంగా 2004లో వచ్చిన సునామీ సమయమనే చెప్పుకోవాలి. ఎప్పుడు మళ్లీ సముద్రం ఉప్పొంగి.. విలయం వస్తుందో తెలీని సమయంలో ధైర్యంగా సాగర జలాల్లో ప్రయాణించిన మగర్.. అండమాన్ నికోబార్ దీవుల్లో చిక్కుకున్న 1,300 మందిని రక్షించి సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చింది. అంతేకాకుండా.. అక్కడి నుంచి వివిధ విపత్తు ప్రాంతాలకు తరలివెళ్లి నిరాశ్రయులుగా మిగిలిన వారికి సహాయక సామగ్రి అందజేయడంలోనూ కీలకంగా వ్యవహరించిన మగర్‌కు భారత రక్షణ దళం నుంచి అద్భుత ప్రశంసలందాయి. కోవిడ్ సమయంలో నిర్వహించిన ఆపరేషన్ సముద్ర సేతులోనూ మగర్ విశిష్ట పాత్ర పోషించింది. వివిధ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల్ని స్వదేశానికి తీసుకురావడం, స్నేహపూర్వక దేశాలకు వైద్యసామగ్రి అందించడం మగర్ ద్వారానే సాధ్యమైంది.

మగర్ సామర్థ్యమిదీ..

నౌకాదళంలో సేవలు ప్రారంభం: 15 జూలై, 1987
పొడవు: 390 అడుగులు
వెడల్పు: 57 అడుగులు
డ్రాఫ్ట్: 13 అడుగులు
వేగం: గంటకు 28 కి.మీ.
ప్రయాణ సామర్థ్యం: ఏకధాటిగా 3 వేల మైళ్ల ప్రయాణం
ఆయుధ సామర్థ్యం: బీఈఎల్–1245 రాడార్ నావిగేటర్, నాలుగు బోఫోర్స్ 40 ఎంఎం గన్స్, 2 మల్టిపుల్ బ్యారెల్ రాకెట్ లాంచర్స్, ఒక సీ కింగ్ హెలికాప్టర్
వార్ ఫేర్ యూనిట్: 15 యుద్ధ ట్యాంకులు, 13 బీఎంపీ పదాతిదళ పోరాట వాహనాలు, 10 ట్రక్కులు, 8 భారీ మోటార్ వెహికల్స్‌తోపాటు 500 మంది సైనికుల్ని ఒకేసారి తీసుకెళ్లగల సామర్థ్యం దీని సొంతం.

నేడు కొచ్చిలో నిష్క్రమణం

నౌకాదళానికి 36 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన మగర్ యుద్ధ నౌకకు కొచ్చి పోర్టులో భారత నౌకాదళం ఘనంగా వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించే డీకమిషన్ కార్యక్రమంలో ఐఎన్ఎస్ మగర్‌లో సేవలందించిన కెప్టెన్‌లు, అధికారులకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా 'అవర్ బోల్డ్ అండ్ బ్రేవ్ మగర్' పేరుతో షార్ట్ ఫిల్మ్‌ని ప్రదర్శించి యుద్ధ నౌకకు ఘనంగా వీడ్కోలు పలకనున్నారు.

టెన్త్ ఫలితాల్లో.. తిరుగులేని 'మన్యం'

- ఏపీలో మొత్తం 72.26 శాతం ఉత్తీర్ణత
- 87.47 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా టాప్..
- 60.39 శాతంతో చివరి స్థానంలో నంద్యాల



పదో తరగతి ఫలితాలను విడుదల చేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అధికారులు

సాక్షి, అమరావతి: టెన్త్ ఫలితాల్లో ఈ ఏడాది పార్వతీపురం మన్యం జిల్లా తిరుగులేని ఫలితాలు సాధించింది. 87.47 శాతం ఉత్తీర్ణతతో ఈ జిల్లా ఏపీలోనే అగ్రస్థానంలో నిలిచింది. 60.39 శాతం ఫలితాలతో నంద్యాల జిల్లా చివరి స్థానం దక్కించుకుంది. అలాగే, ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. రాష్ట్రం మొత్తం మీద ఈ ఏడాది 6,05,052 మంది పరీక్షలకు హాజరుకాగా.. 4,37,196 మంది అంటే 72.26 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికల ఉత్తీర్ణత శాతం 75.38 శాతమైతే బాలురది 69.27 శాతం. 933 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, 38 పాఠశాలల్లో 'జీరో' ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలను విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ శనివారం విజయవాడలోని ఓ హోటల్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో 67.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ ఏడాది ఐదు శాతం అధికంగా ఉత్తీర్ణులయ్యారన్నారు. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.25 శాతం ఉత్తీర్ణత నమోదైందని చెప్పారు. ఇంగ్లిష్ మీడియంలో సైతం 80.82 శాతం మంది ఉత్తీర్ణత సాధించడం విశేషమని ఆయన తెలిపారు.

ఆ ఆరుగురూ పాస్..

దృష్టిలోపం విద్యార్థుల కోసం డిజిటల్ విధానంలో నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు హాజరైన ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. ఈ తరహాలో పరీక్షలు నిర్వహించడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. అనంతపురం జిల్లా పొలిమెర చైత్రిక, చెంచుగారి పావని, యక్కలూరి దివ్యశ్రీ, మేకా శ్రీధాత్రి, యేకుల సౌమ్య, ఉప్పర నాగరత్నమ్మల కోసం డిజిటల్ రూపంలో ఈ పరీక్షలు నిర్వహించారు.

2 నెలల్లో 2 వేల ఐటీ ఉద్యోగాలు

నైపుణ్యం కలిగిన మానవ వనరుల అన్వేషణలో విశాఖ ఐటీ కంపెనీలు

సాక్షి, అమరావతి: ఐటీ దిగ్గజ కంపెనీలు తమ కార్యకలాపాలను విశాఖపట్నానికి విస్తరిస్తుండటంతో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. త్వరలో కార్యకలాపాలు ప్రారంభించనున్న ఇన్ఫోసిస్‌తో పాటు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ సెంటర్, అమెజాన్ డెవలప్‌మెంట్ సెంటర్, రాండ్‌శాండ్, టెక్నోటాస్క్, భారీగా విస్తరిస్తున్న టెక్ మహీంద్రా, డబ్ల్యూఎన్ఎస్ వంటి కంపెనీలు పెద్ద ఎత్తున నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం ఎదురుచూస్తున్నాయి. విశాఖలో ఉన్న ఐటీ కంపెనీలకు వచ్చే రెండు నెలల్లోకనీసం రెండు వేల మంది ఐటీ నిపుణులు అవసరమవుతారని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఐటాప్) అంచనా వేసింది. విశాఖలోని ఐటీ కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా శిక్షణ ఇచ్చి, శిక్షణ పూర్తికాగానే ఉపాధి కల్పించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి కోన శశిధర్ 'సాక్షి'కి తెలిపారు. ఇందు కోసం రెండు నెలల్లో కనీసం రెండు వేల మందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.


గుండ్ల కోనలో అరుదైన శాసనం



గుండ్లకోనలో వెలుగు చూసిన శాసనం

కడప కోటిరెడ్డిసర్కిల్: అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు సమీపంలోని శేషాచలం అడవి పరిధిలో ఉన్న గుండ్ల కోనలో అరుదైన శాసనం వెలుగుచూసింది. తిరుపతికి చెందిన చారిత్రక పరిశోధకులు భూమన సుబ్రహ్మణ్యం దీనిని గుర్తించి భారత పురావస్తుశాఖ అధికారి మునిరత్నంరెడ్డికి పంపారు. ఆయన పరిశీలించి వివరాలు వెల్లడించారు. ఇది తాళ్లపాక పెద తిరుమలయ్య వేయించిన శాసనమని తెలిపారు. పూర్వం శ్రీతిరుమలేశుడు అయిన వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కొన్ని ప్రాంతాల వారు రాజంపేట (తాళ్లపాక) ద్వారా కాలికడకన తిరుమలకు వెళ్లే సంప్రదాయం ఉండేదన్నారు. ఈ శాసనం ఓ రాతిపై చెక్కబడి ఉందని.. 1537 జూన్, 15న శుక్రవారం తాళ్లపాక అన్నమయ్య కుమారుడు తాళ్లపాక పెద్ద తిరుమలయ్య ద్వారా హనుమంతుని ప్రతిమను ప్రతిష్ఠించిన సందర్భంగా ఈ శాసనాన్ని వేయించినట్లు వివరించారు.

జూరాలకు 4,355 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం సాయంత్రానికి ఎగువ నుంచి 4,355 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టు నీటి మట్టం 316.180 మీటర్లుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.54టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఆలమట్టి ప్రాజెక్టు నీటి సామర్థ్యం 129 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం25.99 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎలాంటి ఇన్‌ఫ్లో లేకున్నా.. ప్రాజెక్టు నుంచి 5,393 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా... ప్రస్తుతం ప్రాజెక్టులో 19.82 టీఎంసీల నీరు నిల్వ ఉంది. 3,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 1,511 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంలో మూడు పాయింట్లు..

దోమలపెంట: కురుస్తున్న వర్షాలు వలన నీటి క్యాచ్‌మెంట్ ఏర్పడటంతో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో శ్రీశైలం జలాశయంలో మూడు పాయింట్ల నీటిమట్టం పెరిగింది. శనివారం జలాశయంలో 807.6 అడుగుల వద్ద 32.9253 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దీంతో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకి 634 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్థానికంగా 15.20 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నీటి నిలిపివేత

మదనాపురం: రామన్‌పాడు జలశయంలో శనివారం 1,020 అడుగుల నీటిమట్టం ఉండగా.. జూరాల ఎడమ, సమాంతర కాల్వ నుంచి వచ్చే నీటిని నిలిపివేశారు. రామన్‌పాడు నుంచి ఎన్‌టీఆర్ కాల్వకు నీటిని నిలిపివేశారు. తాగు నీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

ఆంజనేయా.. దీవించయ్యా

- బీచుపల్లిలో భక్తుల సందడి
- బ్రహ్మోత్సవాల్లో భాగంగా అంజన్నకు ప్రత్యేక దాసంగాలు



దాసంగాలు సమర్పిస్తున్న భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా భక్తులతో సందడి నెలకొంది. ఉత్సవాలలో భాగంగా 4వ రోజు ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి ఉదయం పంచామృత అభిషేకం, చొకిసేవ, బలిహరణం వంటి పూజలు చేశారు. రాత్రి ప్రభోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తిశ్రద్ధలతో స్వామిరిని దర్శించుకున్నారు. భక్తులు మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి ఆంజనేయస్వామికి సమర్పించారు. అనంతరం ధ్వజస్తంభం ఎదుట కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరను పురస్కరించుకొని ఆలయ పరిసరాల్లో వివిధ అంగళ్లు భక్తుల కొనుగోళ్లతో సందడిగా కనిపించాయి. ఏటా మే నెలలో వేలాదిగా మంది భక్తుల నడుమ నాలుగు శనివారాల పాటు జాతర కనులపండువగా జరుగుతుంది. కార్యక్రమంలో ఆలయ ఇఓ ఉమారాణి, పాలక మండలి సభ్యులు, అర్చకులు ఉన్నారు.

చీనీతోటలో కాయలు కోసినందుకు..

- గొలుసుతో చిన్నారిని చెట్టుకు కట్టేసిన తోట యజమాని భార్య



విఠలాపురంలో చిన్నారి చేతులకు గొలుసు కట్టిన దృశ్యం

మల్దకల్: చీనీ(బత్తాయి)తోటలో ఓ చిన్నారి కాయలు కోసిందంటూ తోట యాజమాని భార్య చిన్నారి చేతులను గొలుసుతో చెట్టుకు కట్టి దాడి చేసింది. ఈ సంఘటన శనివారం సాయంత్రం జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని విఠలాపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి తన 10 ఎకరాలలో వ్యవసాయ పొలంలో చీనీ పండ్ల తోటను సాగు చేశాడు. కాగా.. కుర్వ గోకారన్న 12ఏళ్ల కుమార్తె ప్రవళిక ఇంటికి సమీపంలోనే ఉన్న మహేందర్‌రెడ్డి తోటలో కాయలు కోసుకునేందుకు వెళ్లింది. గమనించిన తోట యాజమాని భార్య స్నేహలత చిన్నారిని పట్టుకొని అక్కడే తోటలో ఉన్న చెట్టుకు గొలుసుతో చేతులు కట్టి చిన్నారిని కొట్టింది. విషయం తెలుకున్న చిన్నారి తండ్రి గోకారన్న అక్కడికి చేరుకొని యాజమాని భార్యతో వాగ్వాదం చేశాడు. అక్కడే ఉన్న ఓ వ్యక్తి జరిగిన సంఘటనను వీడియో తీసి సోషల్‌మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. దీంతో బాలికను వదిలేశారు. ఈ సంఘటనపై హెడ్ కానిస్టేబుల్ గోపాల్‌నాయక్ సంఘటన స్థలానికి చేరుకోని విచారణ చేపాట్టాడు. కుటుంబసభ్యుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సాంకేతికత సామాన్యులకు ఉపయోగపడాలి

- టాస్క్ సీఈఓ శ్రీకాంత్‌సిన్హా



మాట్లాడుతున్న శ్రీకాంత్ సిన్హా

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం సామాన్యులకు సైతం ఉపయోపడే విధంగా ఉండాలని, కిందిస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు అది పరిష్కారం చూపగలగాలని టాస్క్ సీఈఓ శ్రీకాంత్‌సిన్హా అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని జేపీఎన్‌సీ కళాశాలలో బీటెక్ విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల్లో ఒకే విధమైన సాంకేతిక అందుబాటులో ఉందని, దానిని యువత పట్టణ ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు అనుసంధానం చేస్తే అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు సృష్టించవచ్చని చెప్పారు. తరగతి గదిలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని కూడా దైనందిన జీవితానికి అన్వయించుకోవడం వల్ల సాంకేతికతపై పూర్తి స్థాయిలో పట్టు సాధించేందుకు అవకాశం ఉందన్నారు. విద్యార్థి ఎదుగుదలకు మూలమైన తల్లిదండ్రులను, గురువులను ఎప్పటికీ మరిచిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, టాస్క్ ప్రతినిధి ప్రదీప్‌కుమార్, ప్రిన్సిపల్ సుజీవన్, చంద్రశేఖర్, గురురాఘవేందర్‌రెడ్డి, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ నర్సరీ ఆదర్శంగా నిలవాలి



కొండాపూర్ వననర్సరీని పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

- ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ లోకేష్ జైస్వాల్

గండేడ్: కొండాపూర్ సెంట్రల్ నర్సరీని ఆదర్శంగా తీర్చిదిద్దాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ లోకేష్ జైస్వాల్ సూచించారు. శనివారం గండేడ్ మండల పరిధిలోని ఫారెస్ట్ సెంట్రల్ నర్సరీని సందర్శించారు. దాదాపు గంట పాటు నర్సరీలో ఆయన కలియ దిరిగారు. ఐదు లక్షల మొక్కల లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ నర్సరీలో 40రకాల మొక్కలు పెంచడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. మొక్కలు చనిపోకుండా మందులు వాడి.. లక్ష్యం మేరకు మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అడవిలో మొక్కలు ఎంతగా పెంచితే అంత మంచిదన్నారు. పర్యావరణ సమతుల్యంలో భాగంగా ఎక్కువ మొత్తంలో మొక్కలు నాటి.. వాటి సంరక్షణ బాధ్యత పూర్తిగా తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా వహించరాదని, అంకితభావంతో పని చేయాలన్నారు. మహబూబ్‌నగర్ సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిని క్షితిజ, నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్ డీఎఫ్ఓలు దీప, రామకృష్ణ, సత్యనారాయణ, ఎఫ్ఆర్ఓ మక్తుంముషన్, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రులకేం తెలుసు ప్రాజెక్టుల గురించి..

- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్ని పరిశీలించడానికి వచ్చిన మంత్రులకు ఏమీ తెలియవని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం వట్టెం రిజర్వాయర్ పనుల్ని పరిశీలించడానికి వచ్చిన ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి స్మితా సబర్వాల్, అధికారుల బృందాన్ని మాజీ మంత్రి నాగం కలిసేందుకు ప్రయత్నించగా వారు తిరుగు పయనమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. అధికారులు ప్రాజెక్టు నిర్మాణం కాకుండా నాణ్యతను పరిశీలించాలని, కట్ట నిర్మాణంలో సాంద్రత ఎంత ఉందో తెలుసుకోవాలన్నారు. ప్రాజెక్టు నాణ్యతపై వివరించడానికి వస్తే అధికారులు తనను చూసి వెళ్లిపోయారని తెలిపారు. గతంలో కురిసిన వర్షాలకు రిజర్వాయర్ కట్ట కొంతమేర కొట్టుకుపోయిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేయడంలో దిట్టని.. ఆగష్టు, సెప్టెంబర్‌లో ప్రాజెక్టు పూర్తయి నీళ్లు వస్తాయని మాయమాటలు చెబుతున్నారని, కేసీఆర్ కుమారుడు కేటీఆర్ కూడా అలాగే తయారయ్యారని వివరించారు. ఐఐటీ సంగారెడ్డి సివిల్ ఇంజినీర్ విభాగం కట్టను పరిశీలించాలన్నారు. కేఎల్ఐకి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు లేవని.. వాటికి కూడా వట్టెం వెంకటాద్రి జలాశయం నుంచే నీరందించాలని కోరారు.

మైనర్‌పై లారీ డ్రైవర్ అత్యాచారయత్నం

- భయపడి లారీలోంచి బయటకు దూకేసిన బాలిక
- తీవ్రగాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- ప్రియుడితో కలిసి పెళ్లి చేసుకునేందుకు వెళ్తుండగా ఘటన

దేవరకద్ర రూరల్/మాగనూర్: ఓ మైనర్‌పై లారీ డ్రైవర్ అత్యాచారయత్నం చేసేందుకు ప్రయత్నించగా, భయపడిన బాలిక వెళ్తున్న లారీలోంచి దూకేయడంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. శనివారం తెల్లవారుజామున నారాయణపేట జిల్లా మాగనూర్ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని బస్వాపూర్‌కి చెందిన దంపతులు కూలీ పనులు చేసుకుంటూ తమ ముగ్గురు పిల్లలని చదివిస్తున్నారు. అందులో వారి పెద్ద కుమార్తె దేవరకద్రలోని బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతుంది. ఆమెకు మండలంలోని పెద్దరాజమూర్‌కి చెందిన ఓ యువకుడితో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దర్దూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకొని ఈ నెల 5వ తేదీన రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయారు. దేవరకద్ర సమీపంలోని బండ్రవల్లి దగ్గర రాయచూర్ వైపు వెళ్తున్న ఒక గుర్తు తెలియని లారీని ఆపి ఎక్కారు. దారిలో ఒక దాబా దగ్గర లారీని నిలిపి భోజనం చేశారు. అనంతరం మాగనూర్ దగ్గర వెళ్తున్న సమయంలో లారీ డ్రైవర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయపడిన బాలిక వెళ్తున్న లారీలో నుంచి బయటకు దూకేసింది. దీంతో డ్రైవర్ లారీని ఆపి.. యువకుడిని దింపి అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సంఘటనలో బాలికకు తీవ్ర గాయాలు కాగా, అటుగా వెళ్తున్న ప్రయాణికులు, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు బాలికను స్థానికంగా ఉన్న ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం యువకుడితో పాటు, బాలికను మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. కాగా.. బాలిక పరిస్థితిని గమనించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ విషయంపై బాలిక తల్లి శనివారం మాగనూర్ పోలిస్‌స్టేషన్‌లో ఫిర్యాధు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పరారైన లారీ డ్రైవర్ ఆచూకీ కోసం ఆరా తీస్తున్నారు.